మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 104 శనివారం 27 - 09 - 2025 పేజీలు: 8 వెల: 4

## జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంభానికి ప్రయోజనం



3లో..

## బన్ని ఉత్సవాలను శాంతియుతంగా

# నిర్వహించుకోవాలి

**– జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి**

మనగళం, కర్నూలు: దేవరగట్టు బన్ని ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులు సహకరించాలని, ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి పేర్కొన్నారు. శుక్రవారం దేవరగట్టు గ్రామంలో బన్ని ఉత్సవాల సందర్భంగా నిర్వహణ ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి అధికారులు, గ్రామ పెద్దలతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేవరగట్టు బన్నీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు రెండు లక్షల మందికి పైగా జనం వచ్చే అవకాశం ఉన్నందున మౌలిక వసతుల ఏర్పాటు అత్యంత కీలకం అని పేర్కొన్నారు. ఆయా ప్రభుత్వ శాఖలు అవసరమైన ఏర్పాట్లన్నీ ఉత్సవాలకు రెండు రోజులు ముందే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత సంవత్సరం కంటే అత్యధికంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా సమయంలో ఏవైనా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా, సమీపంలోనే మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేయాలని, కాలిన గాయాలు, పాము కాటు తదితర అవసరమైన మందులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం సకాలంలో స్పందించే విధంగా అంబులెన్స్‌లు సిగ్నల్ పాయింట్ల వద్ద ఉంచాలని సూచించారు. 104,108 వాహనాలను సిద్ధంగాఉంచుకోవాలని, హొళగుంద పీహెచ్ సీ లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఫిజియో థెరపిస్ట్ ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. సంప్రదాయాలను గౌరవిస్తూ, ప్రతి ఒక్కరూ ఆనంద భరితమైన వాతావరణంలో పండుగను జరుపుకో వాలని జిల్లా కలెక్టర్ గ్రామస్తులకు పిలుపుని చ్చారు. బన్నీ ఉత్సవాలు సంప్రదాయ బద్ధంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గ్రామ ప్రజలకు సూచించారు. గతంలో బన్నీ ఉత్సవాల సమయంలో చెట్టు పైన అధిక సంఖ్యలో భక్తులు ఎక్కడంతో ప్రమాదవశాత్తుగా నలుగురు మరణించారని, ఈ సారి ఇలాంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులకు సూచించారు. వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, అలాగే పటిష్టమైన బందోబస్తును కూడా ఏర్పాటు చేస్తున్నా మని ఎస్పీ తెలిపారు. కమ్యూనికేషన్ బాగా ఉండేందుకు, నెట్వర్క్ సమస్యలు తలెత్తకుండా తాత్కాలిక మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ షాక్ వంటి ఘటనలు జరుగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మద్యం వినియోగాన్ని కట్టడి చేయడంలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దసరా పండుగ రోజు రాత్రి బన్నీ ఉత్సవాలు జరిగే తీరును వివరించారు. సమావేశంలో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, ఎక్సైజ్ సూపరిం టెండెంట్ సుధీర్ కుమార్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి , డిపిఓ భాస్కర్, డి ఏం హెచ్ ఓ శాంతికళ,ఆలూరు - హొలగుంద తహసీల్దారులు, ఎంపి డిఓ లు, ఫారెస్ట్ ,ట్రాన్స్కో , పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఇంజనీర్లు, ఎక్సైజ్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## మహిళా సాధికారతే లక్ష్యంగా

## కొత్త పథకానికి శ్రీకారం

**– ఢిల్లీ నుంచి వర్చ్యువల్‌గా పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ**



మన గళం, న్యూఢిల్లీ : బీహార్‌లో మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం ఓ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు వర్చ్యువల్ విధానంలో ప్రారంభించారు. ఈ పథకం కింద తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ. 10,000 చొప్పున జమ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఒకేసారి 2 లో..

## కరోనా తగ్గినా

## వీడని సమస్య



**చాలామందికి తెలియని షాకింగ్ నిజం!**

మన గళం డెస్క్ : కరోనా మహమ్మారి వచ్చి తగ్గాక కూడా దాని ప్రభావాలు చాలామందిని వెంటాడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వాసన పసిగట్టే శక్తి తగ్గిపోవడం అనేది ఒక ప్రధాన సమస్యగా మారింది. అయితే, చాలామందికి తమకు ఈ సమస్య ఉన్నట్టు కూడా తెలియకుండానే ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నారని ఒక తాజా అధ్యయనం సంచలన విషయాలను వెల్లడించింది. కోవిడ్ నుంచి కోలుకున్న తర్వాత వాసన శక్తి 2 లో..

## మెగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం

**– రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి భరత్**



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో మెగా ఇండస్ట్రియల్ పార్కులను కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. శాసన మండలిలో ఆయన సభ్యుల ప్రశ్నలకు సమాధాన మిచ్చారు. నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం నోడ్, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు నోడ్, కడప జిల్లాలోని కొప్పర్తి నోడ్, అనకాపల్లి జిల్లాలోని బల్క్ డ్రగ్ పార్క్ అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్ 2,088 ఎకరాలు, చెన్నై బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ క్రింద కృష్ణపట్నం నోడ్ 2,066 ఎకరాలు, హైదరాబాద్ బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కింద ఓర్వకల్లులో 2,621 ఎకరాలు, వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కింద కడప జిల్లాలోని కొప్పర్తి కారిడార్ 2,136 ఎకరాల్లో పారిశ్రామిక ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఇవే కాకుండా ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీ కింద అభివృద్ధి చేసేందుకు 5 ప్రపోజల్స్ వచ్చాయన్నారు. వెయ్యి ఎకరాల లోపు ఉన్న వాటికోసం 14 అప్లికేషన్స్ వచ్చాయన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రానికి పరిశ్రమలు ఆకర్షించేందుకు మంచి పాలసీలు రూపొందించి గైడ్ లైన్స్ విడుదల చేయడం జరిగిందన్నారు. సభ్యులకు పాలసీ కాపీలు షేర్ చేస్తామన్నారు. గైడ్ లైన్స్ మేరకే పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించడం జరుగుతుందన్నారు. ఇక ప్రజాప్రతినిధులను ఉద్యోగాల కోసం యువత సంప్రదిస్తున్నారన్నారు. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు తాము చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే కంపెనీలు కొన్ని ఉద్యోగాలకు అనుభవం ఉన్న వారిని ఇతర ప్రాంతాలను నుండి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న యువతకు నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే నినాదంతో ముందుకు వెళుతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎం.ఎస్.ఎం.ఇ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిశ్రమలకు భూకేటాయింపులకు సంబంధించి సభ్యులకు ఏదైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామని మంత్రి టి.జి భరత్ తెలిపారు.




## పవన్ కల్యాణ్‌కు

## వైరల్ ఫీవర్..

**– ట్రీట్‌మెంట్ కోసం మంగళగిరి నుంచి హైదరాబాద్‌కు!**

మన గళం, అమరావతి : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజులుగా ఆయన వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ట్రీట్‌మెంట్ తీసుకుం టున్నప్పటికీ ఆయనకు జ్వరం తీవ్రత తగ్గడం లేదు. పైగా దగ్గు కూడా ఎక్కువైంది. దీంతో పవన్ కల్యాణ్ తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలుస్తోంది. పవన్ కల్యాణ్‌కు నాలుగు రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాలని మంగళగిరి వైద్యులు సూచించారు. డాక్టర్ల సూచన మేరకు పవన్ కల్యాణ్ వైద్య పరీక్షల కోసం ఇవాళ 2 లో..

## మోదీ-పుతిన్ మధ్య అలాంటి సంభాషణేమీ జరగలేదు




**- నాటో చీఫ్ వ్యాఖ్యలను ఖండించిన భారత్**

మన గళం, న్యూఢిల్లీ : న్యూ ఢిల్లీపై ట్రంప్ విధించిన టారిఫ్‌లు రష్యాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె పేర్కొన్న విషయం తెలిసిందే. ట్రంప్ విధించిన టారిఫ్‌లతో ఇబ్బంది పడుతున్న న్యూఢిల్లీ.. 2 లో..

## శ్రీలంక జైలులో చిక్కుకున్న

## కాకినాడ మత్స్యకారుల విడుదల

మన గళం డెస్క్ : యాభై రెండు రోజుల సుదీర్ఘ నిరీక్షణ, ఆందోళనల తర్వాత శ్రీలంక జైలులో నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు ఎట్టకేలకు విముక్తి పొందారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు చేసిన ప్రత్యేక చొరవ, ఢిల్లీ స్థాయిలో ఆయన జరిపిన సమన్వయం ఫలించడంతో వారు శు



2 లో..

## చిన్న లాభం చూపి పెద్ద మొత్తాలు

**– ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మహిళలకు ఎర వేస్తున్న మోసగాళ్లు**

మన గళం, అమరావతి :ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరుతో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇంటి వద్ద నుంచే డబ్బు సంపాది ంచవచ్చని చెప్పి అమాయ కులను బోల్తా కొట్టిస్తున్న ఘటనలు కొనసాగుతూనే 2 లో..




## పాక్ ప్రధాని

## నోట కూడా అదే మాట



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో 2 లో..

## మహిళా సాధికారతే లక్ష్యంగా కొత్త పథకానికి శ్రీకారం

మొత్తం రూ. 7,500 కోట్లను లబ్ధిదారులకు బదిలీ చేశారు. ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం పాట్నాలో జరగ్గా, ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పాట్నాలోని కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కొందరు లబ్ధిదారులతో ముచ్చటించారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 30 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరవడం వల్లే ఇప్పుడు ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేయగలుగుతున్నామని ప్రధాని మోదీ గుర్తుచేశారు. "ఒకప్పుడు కేంద్రం 100 రూపాయలు పంపిస్తే, ప్రజలకు చేరేసరికి 15 రూపాయలే మిగిలేవని ఓ మాజీ ప్రధాని చెప్పారు. కానీ ఈ రోజు, ప్రతి రూపాయి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళుతోంది" అని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మాట్లాడుతూ, మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "ఇప్పుడు అందించిన రూ. 10,000 సాయంతో వ్యాపారంలో రాణించిన మహిళలకు భవిష్యత్తులో రూ. 2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు, కోటికి పైగా జీవికా దీదీలతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవితాలను మార్చామని నితీశ్ కుమార్ వివరించారు. ఇదే సమయంలో ఆయన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌పై పరోక్ష విమర్శలు చేశారు. 2005కు ముందు రాష్ట్రాన్ని పాలించిన వారు, పదవి పోగానే తమ భార్యను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. మొత్తం 3.06 కోట్ల దరఖాస్తులు రాగా, తొలి దశలో 75 లక్షల మందిని ఎంపిక చేసినట్లు ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తెలిపారు. 2025లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఈ భారీ పథకాన్ని ప్రారంభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## కరోనా తగ్గినా వీడని సమస్య..



తగ్గిపోయిందని భావిస్తున్న వారే కాకుండా, తమకు ఎలాంటి సమస్యా లేదనుకుంటున్న వారిలోనూ ఈ లోపం ఉన్నట్టు తేలింది. అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్, న్యూయార్క్ యూనివర్సిటీ లాంగోన్ హెల్త్ పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. ఇందులో భాగంగా, 40 రకాల వాసనలను గుర్తించే ఒక ప్రత్యేకమైన పరీక్షను ఉపయోగించారు. కోవిడ్ సోకిన తర్వాత తమ వాసన పసిగట్టే సామర్థ్యంలో మార్పు వచ్చిందని చెప్పిన వారిలో 80 శాతం మంది, దాదాపు రెండేళ్ల తర్వాత జరిపిన ఈ పరీక్షలో చాలా తక్కువ స్కోరు సాధించారు. వీరిలో 23 శాతం మంది వాసనను గుర్తించే శక్తిని తీవ్రంగా లేదా పూర్తిగా కోల్పోయినట్టు స్పష్టమైంది. అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కోవిడ్ సోకినప్పటికీ తమకు వాసన విషయంలో ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పిన వారిలో కూడా 66 శాతం మంది ఈ పరీక్షలో తక్కువ స్కోర్ సాధించడం పరిశోధకులను ఆశ్చర్యపరిచింది. అంటే, వారికి తెలియకుండానే వారి ఘ్రాణశక్తి దెబ్బతిన్నదని ఈ అధ్యయనం తేల్చి చెప్పింది. "కోవిడ్ బారిన పడిన వారిలో వాసన పసిగట్టే శక్తి బలహీనపడే ప్రమాదం ఎక్కువగా ఉందని మా పరిశోధన నిర్ధారించింది. ఇది సాధారణ ప్రజలలో పెద్దగా గుర్తించబడని సమస్య" అని అధ్యయన సహ రచయిత్రి లియోరా హార్విట్జ్ వివరించారు. దాదాపు 3,535 మందిపై జరిపిన ఈ అధ్యయన ఫలితాలు ప్రముఖ వైద్య పత్రిక 'జామా నెట్‌వర్క్ ఓపెన్'లో ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో కోవిడ్ నుంచి కోలుకున్న వారికి వైద్యులు తప్పనిసరిగా వాసన పరీక్షలు కూడా చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం విటమిన్-ఎ సప్లిమెంట్లు, వాసనలకు మెదడును తిరిగి స్పందించేలా చేసే 'ఆల్ ఫ్యాక్టరీ ట్రైనింగ్' వంటి చికిత్సల ద్వారా ఈ సమస్యను అధిగమించే మార్గాలపై పరిశోధనలు జరుగుతున్నాయి.

## మోదీ-పుతిన్ మధ్య అలాంటి సంభాషణేమీ జరగలేదు

రష్యా అధినేతతో ప్రధాని మోదీ మాట్లాడినట్లు తెలిపారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా వ్యూహంపై మోదీ ఆరా తీసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఆయన వ్యాఖ్యలపై భారత్ తాజాగా స్పందించింది. నాటో చీఫ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ప్రధాని మోదీ, పుతిన్ మధ్య అలాంటి చర్చలు ఏమీ జరగలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఫోన్ సంభాషణకు సంబంధించి నాటో చీఫ్ మార్క్ రుటె చేసిన వ్యాఖ్యలు మా దృష్టికి వచ్చాయి. ఆయన చెప్పినట్టుగా మోదీ-పుతిన్ మధ్య అలాంటి చర్చలు ఏవీ జరగలేదు. ఆయన చేసిన ప్రకటన తప్పు. పూర్తిగా నిరాధారమైనవి' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. న్యూయార్క్‌లో నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె మాట్లాడుతూ.. 'రష్యా నుంచి చమురు కొంటోందన్న కారణంగా భారత్‌పై ట్రంప్ విధించిన అదనపు సుంకాలు రష్యాపై పెద్ద ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ సుంకాలతో భారత్ కూడా తీవ్ర ఇబ్బంది పడుతోంది. దీంతో రష్యా అధినేతకు ఢిల్లీ నుంచి ఫోన్ వెళ్తోంది. పుతిన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా వ్యూహంపై మోదీ ఆరా తీస్తున్నారు. భవిష్యత్ వ్యూహాల గురించి అడిగి తెలుసుకుంటున్నారు' అని మార్క్ రుటె వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి.

# పాక్ ప్రధాని నోట కూడా అదే మాట



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక పాత్ర పోషించారని పాకిస్థాన్ చేసిన తాజా ప్రకటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ వాదనను భారత్ మొదటి నుంచి ఖండిస్తూ వస్తోంది. పాకిస్థాన్ అభ్యర్థన మేరకే తాము కాల్పుల విరమణకు అంగీకరించామని, ఇందులో మూడో దేశం ప్రమేయం ఏమాత్రం లేదని స్పష్టం చేసింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ సయ్యద్ అసిమ్ మునీర్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఓవల్ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం పాక్ ప్రధాని కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. "భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు వీలు కల్పించినందుకు ట్రంప్ సాహసోపేతమైన నాయకత్వానికి ప్రధాని ప్రశంసలు తెలిపారు" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, భద్రతా సహకారం వంటి అంశాలపై కూడా చర్చలు జరిగాయని, పాకిస్థాన్‌లో పర్యటించాలని ట్రంప్‌ను ప్రధాని ఆహ్వానించారని తెలిపారు.

పాకిస్థాన్ వాదనను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. కాల్పుల విరమణ కోసం పాకిస్థాన్ సైనిక ఉన్నతాధికారే తమ డైరెక్టర్-జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)ను సంప్రదించారని భారత్ ఎప్పటినుంచో చెబుతోంది. ఈ విషయంపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల పార్లమెంటులో కూడా స్పష్టత ఇచ్చారు. "అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నాకు ఫోన్ చేసి, పాకిస్థానీయులు చర్చలకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆ తర్వాత పాక్ డీజీఎంఓ మా డీజీఎంఓను సంప్రదించారు. కాల్పుల విరమణ ప్రకటనకు ముందు ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య ఎలాంటి సంభాషణ జరగలేదు" అని జైశంకర్ తేల్చిచెప్పారు.

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన ఘటనకు ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. ఈ దాడి వెనుక పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా హస్తం ఉందని తేలడంతో భారత్ తీవ్రంగా స్పందించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తో పాటు పాకిస్థాన్‌లోని ముజఫరాబాద్, కోట్లి, రావల్‌కోట్ సహా మొత్తం 9 ప్రాంతాల్లోని ఉగ్రవాద శిబిరాలు, సైనిక స్థావరాలపై 24 క్షిపణులతో కచ్చితమైన దాడులు చేసింది. ఈ దాడుల్లో రాడార్లు, యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థలతో పాటు అత్యంత కీలకమైన అవాక్స్‌విమానాన్ని కూడా నేల మీదే ధ్వంసం చేసింది. ఈ భారీ ఆపరేషన్ తర్వాతే పాకిస్థాన్ దిగివచ్చి కాల్పుల విరమణ కోసం చర్చలకు సిద్ధపడిందని భారత వర్గాలు చెబుతున్నాయి. ఉగ్రవాదం ఎక్కడి నుంచి వచ్చినా దాడులు కొనసాగుతాయని, 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

# పవన్ కల్యాణ్‌కు వైరల్ ఫీవర్..

మంగళగిరి నుంచి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. పవన్ కల్యాణ్ జ్వరంతో బాధపడుతున్నప్పటికీ సోమవారం నాడు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఆ రోజు రాత్రే పవన్ కల్యాణ్‌కు జ్వరం పెరిగింది. దీంతో విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కానీ రెస్ట్ తీసుకోకుండా శాఖపరమైన అంశాలపై అధికారులతో డిప్యూటీ సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారని జనసేన పార్టీ తెలిపింది.

## శ్రీలంక జైలులో చిక్కుకున్న కాకినాడ మత్స్యకారుల విడుదల

శుక్రవారం (సెప్టెంబర్ 26) సురక్షితంగా స్వదేశానికి తిరిగి రానున్నారు. ఈ వార్త తెలియడంతో వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

కాకినాడకు చెందిన కె. శ్రీను వెంకటేశ్వర్, కరినోకరాజ్ బొర్రియా, చందా నాగేశ్వరరావు, బ్రన్మంథం అనే నలుగురు మత్స్యకారులు కొత్తగా ఫిషింగ్ ట్రాలర్ కొనుగోలు చేసేందుకు తమిళనాడులోని నాగపట్నం వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా, నావిగేషన్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా పొరపాటున శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించారు. దీంతో ఆగస్టు 4న శ్రీలంక నావికాదళం వారిని అదుపులోకి తీసుకుని, జాఫ్నా జైలుకు తరలించింది. అప్పటి నుంచి గత 52 రోజులుగా వారు అక్కడే నిర్బంధంలో ఉన్నారు. మత్స్యకారులను విడిపించేందుకు భారత కాన్సులేట్ అధికారి రాజీవ్ నేతృత్వంలో శ్రీలంక ప్రభుత్వంతో పలు దఫాలుగా చర్చలు జరిగాయి. వారి ప్రయత్నాలు ఫలించి, సెప్టెంబర్ 25న జాలర్లను భారత్‌కు తరలించాలని నిర్ణయించారు. అయితే, భారత ఏజెన్సీలతో సమన్వయ లోపం, కొన్ని విధానపరమైన అడ్డంకుల కారణంగా ఆఖరి నిమిషంలో విడుదల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర నిరాశ అలుముకుంది.

**- రంగంలోకి దిగిన ఎంపీ సానా సతీష్ బాబు**

ఈ క్లిష్ట పరిస్థితుల్లో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు తక్షణమే రంగంలోకి దిగారు. ఆయన ఈ విషయాన్ని న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ కమిషనర్ డాక్టర్ అర్జా శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన డాక్టర్ శ్రీకాంత్, స్వయంగా ఇండియన్ కోస్ట్ గార్డ్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ప్రిన్సిపల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పంకజ్ వర్మతో సమావేశమయ్యారు. మత్స్యకారుల విడుదలకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో కోస్ట్ గార్డ్ అధికారులు వేగంగా స్పందించారు. పంకజ్ వర్మ... శ్రీలంక కోస్ట్ గార్డ్ కమాండర్ దినేష్ జేతో సమన్వయం చేసుకుని విడుదల ప్రక్రియను వేగవంతం చేశారు. కోర్టు నుంచి అవసరమైన అనుమతులు రాగానే, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జాలర్లను జాఫ్నా జైలు నుంచి విడుదల చేశారు. అనంతరం వారిని



అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ వరకు తీసుకువచ్చి, సాయంత్రం 6 గంటల సమయంలో రామేశ్వరంలోని మండపం బేస్ సమీపంలో ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు అధికారికంగా అప్పగించనున్నారు. అక్కడి నుంచి వారు తమ స్వస్థలమైన కాకినాడకు బయలుదేరనున్నారు. నిలిచిపోయిన విడుదల ప్రక్రియను కేవలం ఒక్క రోజులోనే పునరుద్ధరించి, మత్స్యకారులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో ఎంపీ సానా సతీష్ బాబు పోషించిన కీలక పాత్రపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## చిన్న లాభం చూపి పెద్ద మొత్తాలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు

ఉన్నాయి. తాజాగా విజయవాడలో జరిగిన ఘటన సైబర్ మోసగాళ్ల కొత్త పద్ధతిని బహిర్గతం చేసింది. విజయవాడ మాచవరానికి చెందిన 33 ఏళ్ల మహిళకు గత నెల 17న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను 'ఎన్ఎస్ఈ చెట్టినాడ్ రెస్టారెంట్'లో హెచ్ఆర్ అసిస్టెంట్‌ను అని పరిచయం చేసుకున్నాడు. గూగుల్ మ్యాప్స్‌లో రెస్టారెంట్లకు రివ్యూలు రాస్తే ప్రతీ రివ్యూకి రూ.5 వేల నుంచి రూ.8,650 వరకు చెల్లిస్తామని చెప్పాడు. మొదట చిన్న చిన్న రివ్యూలకు డబ్బులు పంపి నమ్మకం కలిగించాడు. తరువాత కవితాసింగ్ అనే టెలిగ్రామ్ యూజర్‌తో ఆ మహిళను కలిపాడు. ఆమె పంపిన లింక్ క్లిక్ చేసి రివ్యూలు రాయడం ప్రారంభించగా, మొదట కొంత డబ్బు నిజంగానే జమ కావడంతో నమ్మకం పెరిగింది. ఆ తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే మరింత లాభం వస్తుందని చెప్పి పెట్టుబడులు పెట్టేలా ప్రలోభ పెట్టారు. వారి మాటలు నమ్మిన ఆమె క్రమంగా పెట్టుబడులు పెట్టింది. సైబర్ నేరగాళ్లు సూచించిన బ్యాంక్ ఖాతాలకు, యూపీఐ ఖాతాలకు విడతల వారీగా మొత్తం రూ.6.02 లక్షలు పంపింది. లాభాలు వస్తాయని ఆశించి పెట్టుబడి పెట్టినా చివరికి డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి నుంచి తీసుకున్న మొత్తం డబ్బు ఉత్తరాది రాష్ట్రాల్లోని బ్యాంకు ఖాతాలకు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్ క్షత్రియ బ్యాంక్, భజరంగ్ ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, పశ్చిమ బెంగాల్‌లోని ఎస్‌బీఐ, మహారాష్ట్రలోని బంధన్ బ్యాంక్, హరియాణాలోని యూనియన్ బ్యాంక్, మహారాష్ట్రలోని ఫినో పేమెంట్స్ బ్యాంక్‌లకు ఈ డబ్బు వెళ్లినట్లు తేలింది. ప్రస్తుతం పోలీసులు ఈ బ్యాంకు ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు.




ఇంటి వద్ద నుంచే సులభంగా డబ్బు సంపాదించవచ్చని చెప్పే ఆన్‌లైన్ జాబ్స్ చాలా వరకు మోసపూరితమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చిన్న మొత్తంలో డబ్బు చెల్లించి నమ్మకం కల్పించి, తర్వాత పెద్ద మొత్తాలు వసూలు చేసే కొత్త తరహా మోసాలు పెరుగుతున్నాయి. పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దు. అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి స్కీమ్స్ జాగ్రత్తగా పరిశీలించాలి. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకూడదు. ఈ ఘటన సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరాన్ని మరోసారి తెలియజేస్తోంది. సులభంగా డబ్బు వస్తుందని ఆశపడితే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జాబ్స్ చాలా వరకు మోసపూరితమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చిన్న మొత్తంలో డబ్బు చెల్లించి నమ్మకం కల్పించి, తర్వాత పెద్ద మొత్తాలు వసూలు చేసే కొత్త తరహా మోసాలు పెరుగుతున్నాయి. పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దు. అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి స్కీమ్స్ జాగ్రత్తగా పరిశీలించాలి. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకూడదు. ఈ ఘటన సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరాన్ని మరోసారి తెలియజేస్తోంది. సులభంగా డబ్బు వస్తుందని ఆశపడితే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## భూమి కోల్పోయే వివరాలు త్వరగా అందించండి

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర పరిధిలో నందికొట్కూరు రహదారిన చెక్‌పోస్ట్ నుండి ఎస్.ఎస్. గార్డెన్స్ వరకు ఎన్‌హెచ్%-%340సి రహదారి విస్తరణకు సెంట్రల్ మార్కింగ్ ప్రకారం భూములు కోల్పోనున్న ప్రభావితుల వారీగా సమగ్ర విస్తీర్ణ వివరాలు త్వరగా అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆర్ అండ్ బి శాఖ అధికారులకు సూచించారు. గురువారం ఆయన నగరపాలక కార్యాలయంలో ఆర్ అండ్ బి, పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో కలిసి ఎన్‌హెచ్-340సి రహదారి పురోగతిపై చర్చించారు. ఈ నెల 2న జిల్లా కలెక్టర్ ఇచ్చిన సూచనల ప్రకారం డ్రాఫ్ట్ ప్రణాళిక రహదారి ప్రణాళికను ఆర్ అండ్ బి శాఖ అధికారులు మున్సిపల్ అధికారులకు అందించారు. ఒక్కో ప్రభావిత యజమాని వారీగా పూర్తి వివరాలు అందించిన వెంటనే, టిడిఆర్ బాండ్ల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ అండ్ బి శాఖ డీఈ జగదీష్, ఏఈఈ భార్గవ్, డిసిపి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, సర్వేయర్లు మద్దలేటి, శ్రీనివాస్, ప్లానింగ్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ చట్టాన్ని అమలు చేయండి

**– రైతులను బెదరించడం సమంజసం కాదు**

మనగళం, కర్నూలు సిటీ : భూ సేకరణ చట్టం(2013) ప్రకారం ఏదేని ప్రాజెక్టు నిర్మించాలంటే 80% ప్రజలు అంగీకరించాల్సి ఉందని, అయితే అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించడం సమంజసం కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే వెంకటేశులు, రామకృష్ణ ఓ ప్రకటనలో హెచ్చరించారు. రైతులు అనేక రకాలుగా అష్ట కష్టాలు పడుతున్నప్పటికీ గోరుచుట్టు పైన, రోకటిపోటులా ఆలూరు మండలం, మన్నెకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్డు వచ్చి మరింత కష్టాలు తెచ్చిపెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన్నెకుర్తి గ్రామానికి 24వ తేదీ వచ్చినటువంటి అధికారులు మీరు మేము చెప్పినట్టుగా వింటే ఎకరాకు రూ. 18 లక్షలు ఇస్తాం... లేని పక్షంలో కేవలం రూ. 6 లక్షల మాత్రమే ఇచ్చి తీసుకోవలసి వస్తుందని ఓ విధంగా బెదరింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు ఇలా వ్యవహరించడం రైతులను భయభ్రాంతులకు గురి చేయడమేనని, ఈ విషయం పత్రికలలో వచ్చిందని గుర్తు చేశారు. అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడడం మంచిది కాదని, రైతులకు అండగా నిలిచి ప్రత్యామ్నాయ పద్ధతులు ఆలోచన చేయాలని సూచించారు. రైతులు సాగు చేసుకుంటున్న సారవంతమైన భూములు కాకుండా ఇతర భూములను ఫ్యాక్టరీ నిర్మాణాలకు కేటాయించాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

## అక్రమ నిర్మాణాలపై ఉదాసీన వైఖరిని వీడండి

- వెంటనే నోటీసులు జారీ చేసి, చార్జిషీట్ దాఖలు చేయండి
- ఎల్‌ఆర్‌ఎస్ పథకం క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించండి
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం



మనగళం, కర్నూలు సిటీ : నగరంలో అక్రమ నిర్మాణాలపై ఉదాసీన వైఖరిని వీడాలని, వెంటనే నోటీసులు జారీ చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ భవనంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, సిబ్బందితో కలిసి ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. పలువురు అర్జీదారులు తమ సమస్యలను చెప్పగా, జాప్యానికి కారణాలను అడిగి, చట్టపరిధిలో వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, ఇతర కార్యదర్శుల సహాయం తీసుకుని అక్రమ నిర్మాణాలు గుర్తించాలన్నారు. అప్రూవల్ ఉందా? ప్లాన్ విరుద్ధంగా ఏమైనా నిర్మాణాలు చేస్తున్నారా? చెక్‌లిస్ట్ ప్రకారం పత్రాలు ఉన్నాయా? అనే అంశాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. అందుకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు వెంటనే నోటీసులు జారీ చేసి, చార్జిషీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) పథకంపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్, డీసీపీ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, సిబ్బంది అనంత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు కొనసాగిస్తాం




మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగరంలోని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యాలయంలో చాకలి ఐలమ్మ 130వ జయంతి ఓల్డ్ సిటీ కార్యదర్శి జయమ్మ న్యూ సిటీ అధ్యక్షుడు సి రాముడు అధ్యక్షతన జరిగింది. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వృత్తి సంఘాల సీనియర్ నాయకులు జి రామకృష్ణ, ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్, కర్నూల్ న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు చాకలి ఐలమ్మ సేవలను గుర్తు చేశారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం సాయుధ రైతాంగ పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని చెప్పారు. వరంగల్ జిల్లాలో రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామం లో వీర వనిత చాకలి ఐలమ్మ జన్మించిన్నారని, నల్లగొండ జిల్లా జనగామ తాలూకా పాలకుర్తి గ్రామానికి చెందిన చిట్యాల నరసయ్య తో 14 సంవత్సరాల వయసులో వివాహం జరిగిందన్నారు. భర్తతో కలిసి ఆనాటి భూస్వాముల సహకారంతో ప్రజలపై దాడులు చేస్తున్న నిజాం నవాబుకు సంబంధించిన రజాకార్లకు వ్యతిరేకంగా ఆమె పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అప్పటికే రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టుల సహకారంతో నిజాం నవాబు గద్దె దిగాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ఆంధ్ర మహాసభ జరుపుతున్న పోరాటంలో వీర వనిత చాకలి ఐలమ్మ ఆమె భర్త ఇద్దరు పాల్గొన్నారని గుర్తు చేశారు. తదుపరి నిజాం సైన్యం అయినా రజాకార్లు స్థానిక భూస్వామ్యల గుండాలతో కలిసి ఆమె ఇంటి పై దాడి చేసి ఇంటికి నిప్పు పెట్టారని, ఈ దాడి నుండి ఆమె తప్పించుకున్నప్పటికీ కుమార్తె సోమ నరసమ్మ రజాకార్ల చేతిలో అత్యాచారానికి బలి అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పోలీసులు పెట్టిన నిచిత్రహింసలకు తట్టుకోలేక ఆమె భర్త మరణించారన్నారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో పాలకుర్తి విసునూరు దేశ్ముఖ్ నరసింహారెడ్డి తన బంటు శేషగిరిరావులను ఎదుర్కొని వారి వారి దగ్గర ఉన్న ధనం, భూములను పెద్ద ఎత్తున పేదలకు పంపిణీ చేయడంలో ఆమె కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రవిశంకర్, సూరి, పుష్ప, ఎల్ల రాజు, కర్నూల్ నగర నాయకులు మద్దిలేటి, కర్రెన్న, చంద్రన్న, రమేష్, దేవేంద్ర, తదితరులు పాల్గంటున్నారు మహిళలు పెద్ద ఎత్తున వృత్తిదారులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రవిశంకర్, సూరి, పుష్ప, ఎల్ల రాజు, కర్నూల్ నగర నాయకులు మద్దిలేటి, కర్రెన్న, చంద్రన్న, రమేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంభానికి ప్రయోజనం



**– టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి**

మనగళం, కర్నూలు సిటీ : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణల అమలుతో ప్రతి కుటుంభానికి రూ. 15వేల మేరకు ఆదా అవుతుందని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి వెల్లడించారు. ఈ విషయమై ఆయన పత్రికల ప్రతినిధులతో మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలపై పార్టీ శ్రేణులు చేపట్ట వలసినటువంటి కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్డ్ ను వివరించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు జీఎస్టీ ప్రయోజనాలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన నిర్దేశాలను జారీ చేశారన్నారు. ఈ మేరకు టీడీపీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, శాసనసభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జీలు తమ నియోకవర్గం పరిధిలో కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. మొదటి దశ సెప్టెంబర్ 26 నుండి ప్రతి మండలం, వార్డు, గ్రామంలో బహిరంగ సభ నిర్వహించి జీఎస్టీ 2.0 లాభాలపై సవివరంగా తెలియజేయాలన్నారు. ఇందులో భాగంగా రైతులు, మహిళలు, వ్యాపారులు, యువత చిన్న చిన్న సమావేశాలు నిర్వహించాలని సూచించారు. క్లస్టర్ ఇన్చార్జీలు తమ పరిధిలోని బూతుల వారీగా ప్రచారం చేయాలన్నారు. రెండవ దశ అక్టోబర్ 1 నుండి 18 వతేదీ వరకు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గం పరిధిలో మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జీలను సమన్వయం చేసుకొని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా అక్టోబర్ 19న ముగింపు కార్యక్రమాన్ని భారీ ఎత్తున పండుగ వాతావరణంలో నిర్వహించాలని చెప్పారు. జీఎస్టీ తగ్గింపు కారణంగా వ్యాపారులకు అమ్మకాలు పెరిగి, సులభతరమైన స్లాబ్ పద్ధతి అవుతుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజానీకానికి ఎంతో మేలు చేకూరుతుందని, నూతన జీఎస్టీ కారణంగా వ్యవసాయ యంత్రాలపై 12% నుండి 5% తగ్గింపు, కారణంగా రైతు జీవన ప్రమాణాలు మెరుగు, ఆదాయం రెట్టింపు అవుతుందని వివరించారు. బియ్యం, గోదుమలు, పాలు, కూరగాయలపై 0% జీఎస్టీ వలన ప్రతి ఇంట అనందం, భారం లేని జీవితం సాగుతుందన్నారు. ఐ.టి. ఉద్యోగులకు ఇన్ ఫుట్ టాక్స్ క్రెడిట్ సులభమైన పన్ను విధానం, ఇవికాక మహిళల అభ్యునత్నకి సాకారమౌతుందన్నారు. అలాగే యువత ఉజ్వల భవిష్యత్ కు పునాదులవుతాయని ఆయన వివరించారు.

# సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూ సిటీ కమిటీ విస్తృతస్థాయి సమావేశం కేకే భవన్ నందు సంఘం న్యూ సిటీ నగర అధ్యక్షులు ఎస్ మా భాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు భారతదేశంలోని అన్ని రంగాల కార్మిక వర్గ నాయకులు, విదేశాల నుండి కార్మిక వర్గ నాయకులు హాజరవుతారని చెప్పారు. ఈ మహాసభలలో ఐదు రోజులపాటు సంఘటిత అసంఘటిత రంగ ఉద్యోగ కార్మికుల సమస్యలపై చర్చ సాగుతుందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, ఆశ అంగనవాడి మధ్యాహ్న భోజనం స్కీం వర్క్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఈఎస్ఐపిఎఫ్ఓ గ్రాజిటీ అమలు చేయాలని, భవన నిర్మాణం, ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఎస్ఐపిఎఫ్ అమలు చేయాలి డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర నాయకులు కే సుధాకరప్ప, ఎస్ రహిమాన్, కె జానకి, రామ్, జి లక్ష్మన్న, ఎం దాసన్న, టీ చిట్టి బాబు, పి పురుషోత్తం, ప్రభాకర్, వాజిద్, సుంకన్న, జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి మృతదేహం లభ్యం

**– మరో విద్యార్థి కోసం కొనసాగుతున్న గాలింపు – ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

మనగళం, కర్నూలు క్రైం : కర్నూలులోని దేవనగర్‌లోని కేసీ కెనాల్ వద్ద హృదయ విదారక విషాదం సంభవించిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం కర్నూలులోని సీఆర్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ లో 7 వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈత కొట్టడానికి కేసీ కెనాల్ కు వెళ్లి నీటి ప్రవాహం ఉధృతం కావడంతో కొట్టుకు పోయారు. వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించగా ఒక విద్యార్థి మాస్టర్ అశోక్ మృతదేహాన్ని గుర్తించారు. పోస్ట్‌మార్టం కూడా పూర్తయింది. అతనికి ఇద్దరు అక్కలు, అన్నయ్య ఉన్నారు. మరొక అబ్బాయి మాస్టర్ ప్రశాంత్ ఇంకా కనిపించడం లేదు. అతని మృతదేహం కోసం వెదుకుతున్నారు. ఇద్దరు పిల్లలు రోజువారీ కూలీ కార్మికుల కుటుంబాలకు చెందినవారు. ఇప్పటికే క్లిష్ట పరిస్థితులలో నివసిస్తున్నారు. ఈ సంఘటనతో రెండు కుటుంబాలు భరించలేని బాధ, దుఃఖం తో ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మరణించిన విద్యార్థి అశోక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గల్లంతయిన విద్యార్థి ప్రశాంత్ కుటుంబం ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరం అని కలెక్టర్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కలెక్టర్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# అత్యవసర సేవలకు 112 కు డయల్ చేయండి

మనగళం, కర్నూలు క్రైం : ప్రజలు, బాధితులు అత్యవసర సేవలకు ఎప్పుడైనా సరే 112 కు డయల్ చేయాలని, పోలీసులు వెంటనే స్పందించి అండగా నిలుస్తారని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. ఆపదలు.. అత్యవసర పరిస్థితులు... ఎమైనా సమస్యలు... అసాంఘిక కార్యకలపాలు... ఎదైనా మీ దృష్టికి వచ్చినా వెంటనే డయల్ 112 కి జిల్లా ప్రజలు కాల్ చేసి సమాచారం అందించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. గొడవలు.. తగాదాలు... అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఏ అనుమానమైన విషయాలు మీ దృష్టికి వచ్చినా వెంటనే డయల్ 112 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డయల్ 112 కు కాల్ చేసినా వెంటనే స్పందించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బ్లూ కోల్ట్స్, రక్షక్, పోలీసులు కేవలం 15 నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకొని సమస్యను తెలుసుకుని, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. డయల్ 112 హెల్ప్ లైన్ నెంబర్ 24%శ%7 కమాండ్ కంట్రోల్ కు అనుసంధానమై అందుబాటులో ఉంటుందన్నారు. క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్స్, రక్షక్, పోలీస్ సిబ్బందికి క్షణాల్లో సమాచారం వెళుతుందన్నారు. జిల్లాలోని ప్రజలు గతంలో పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ గా ఉన్న డయల్ 100 నంబర్ కు బదులు హెల్ప్ లైన్ నెంబర్ డయల్ 112 నంబర్ గా ప్రభుత్వం మార్చడం జరిగిందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి డయల్ 112 హెల్ప్ లైన్ నెంబర్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించి పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ప్రజలను ఎస్పీ కోరారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల గ్రామాలు, పట్టణ శివార్లలో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువలు పూర్తిగా నిండిపోవడం జరిగిందని ఎస్పీ గుర్తు చేశారు. దసరా సెలవుల నేపథ్యంలో పిల్లలు, యువకులు ఈతకు వెళ్లడం వల్ల ప్రమాదకరమైన ఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో గమనించాలని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి నదీ తీరా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ఎదైనా సమస్యలుంటే వెంటనే డయల్ 112 కి సమాచారం అందించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



– జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

# వరసగా ఐదోరోజూ నష్టాల్లోనే..

మన గళం, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదోరోజూ గురువారం కూడా నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 25వేల దిగువకు చేరింది. గురువారం నిఫ్టీ 166.05 పాయింట్ల నష్టంతో 24,890.85 వద్ద ముగిసింది. అలాగే సెన్సెక్స్ ఉదయం 81,574.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,715.63) నష్టాల్లో ప్రారంభమైంది. ప్రారంభంలో కాసేపు లాభాల్లోకి వచ్చినా రోజంతా నష్టాల్లోనే కదలాడింది. చివరికి 555.95 పాయింట్ల నష్టంతో 81,159.68 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో బిఇఎల్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఆసియా మార్కెట్‌ల్లో జపాన్ మినహా మిగిలిన మార్కెట్‌లు నష్టాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్‌లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్లు, బంగారం ఔన్సు 3758 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మదుపర్ల సంపదగా భావించే బిఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.457.4 లక్షల కోట్లకు చేరింది. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, హెచ్-1బీ వీసా రుసుము పెంపు, ట్రంప్ సుంకాలు వంటి ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలూ ప్రభావం చూపాయి.




# త్వరలో పర్సనల్ కంప్యూటర్ల కోసం ఆండ్రాయిడ్ ఓఎస్

మన గళం, ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించి గూగుల్ సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు మొబైళ్లకే పరిమితమైన ఆండ్రాయిస్ ఓఎస్‌ను భవిష్యత్తులో పర్సనల్ కంప్యూటర్లలోనూ తీసుకురావాలని భావిస్తోంది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ ఓఎస్ చిన్న పరికరాలకే పరిమితం అయింది. గతంలో కంప్యూటర్లలో క్రోమ్ ఓఎస్‌ను ప్రారంభించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఆదరణ పొందలేదు. దీంతో ఇప్పటికీ పర్సనల్ కంప్యూటర్ విభాగంలో యాపిల్ మ్యాక్ ఓఎస్, మైక్రోసాఫ్ట్ విండోస్ ఓఎస్‌లదే ఆధిపత్యం కొనసాగుతోంది. అయితే, పీసీల మార్కెట్లో గూగుల్ మరోసారి ఆండ్రాయిడ్ ఓఎస్‌ను తీసుకురావాలని భావిస్తోంది. దీనికోసం ఆండ్రాయిడ్, క్రోమ్ ఓఎస్‌ను విలీనం చేసేందుకు సిద్ధమైంది. తాజాగా హవాయి కేంద్రంగా జరిగిన స్నాప్ డ్రాగన్ సమ్మిట్‌లో గూగుల్ ప్రతినిధి ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. పర్సనల్ కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌లకు వేర్వేర్ ఆపరేటింగ్ సిస్టమ్(ఓఎస్) ఉన్నాయి. ఈ రెండింటిని విలీనం చేస్తామని, పీసీలకు ఆండ్రాయిడ్ ఏఐ, జెమిని ఏఐ ఫీచర్లు యాడ్ చేయనున్నాం. మా అప్లికేషన్‌లు, డెవలపర్ కమ్యూనిటీలన్నింటినీ పీసీ డొమైన్‌లోకి తీసుకురావడంపై కలిసి చేస్తున్నాం. కంప్యూటర్ విభాగంలో అందరికీ ఆండ్రాయిడ్ సేవలందించేందుకు ఇదొక మార్గమని భావిస్తున్నట్టు గూగుల్ ప్రతినిధి ఓస్టర్‌లోహ్ వివరించారు. కాగా, ఎంట్రీ లెవల్ కంప్యూటర్లలో మెరుగైన సేవల కోసం క్రోమ్ ఓఎస్‌ను గూగుల్ అందిస్తోంది. కానీ, అది పూర్తిస్థాయిలో విజయవంతం కాకపోవడంతో ప్రస్తుతం పీసీ మార్కెట్లో క్రోమ్ ఓఎస్ వాటా 7 శాతం వద్దే ఉంది. విండోస్ ఇప్పటికీ దాదాపు 80 శాతం వాటాతో ఆధిపత్యం కొనసాగిస్తోంది.




# కోడుమూరు నందు నవరాత్రి పూజల సందర్భంగా శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి రూపంలో కొలువుతీరిన శ్రీశ్రీశ్రీ గంగాభవాని మాత






మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానిక గూడూరు రోడ్డు నందు వెలిసిన శ్రీ శ్రీ శ్రీ గంగా భవాని మాత దేవాలయం ముందు అమ్మవారికి నవరాత్రి పూజల సందర్భంగా విశేష పూజలు జరిగాయి నవరాత్రి పర్వదిన పూజలలో భాగంగా ఈరోజు 5వ రోజు శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి రూపంలో కొలువుతీరిన శ్రీ శ్రీ శ్రీ గంగా భవాని మాత భక్తాదులందరి చేత అభిషేక పూజలు కుంకుమార్చన మరియు చందనోత్స పూజలు అందుకున్నారు భక్తులంతా అమ్మవారికి తాము తెచ్చిన నైవేద్యాలు భక్తితో అమ్మవారి సమర్పించి మనస్ఫూర్తిగా అమ్మవారి పూజ చేసుకొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు అనంతరం శ్రీశ్రీశ్రీ గంగాభవాని మాత దేవాలయ భక్తబృందం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించి అమ్మవారి అమ్మవారి దీవెనలు పొందారు ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు మరియు దేవాలయ భక్త బృందము స్థానిక భక్తులు విరివిగా పాల్గొన్నారు

# ఆర్థిక సంస్కరణల రూప శిల్పి మన్మోహన్ సింగ్

– మాజీ ఎమ్మెల్సీ యం సుధాకర్ బాబు



మనగళం, కర్నూలు సిటీ : ఆర్థిక సంస్కరణల రూపశిల్పి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని మాజీ ఎమ్మెల్సీ, మాజీ డీపీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ ఎం సుధాకర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ 93 వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుధాకర్ బాబు మాట్లాడుతూ రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, అంతకు ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్ అందించిన సేవలు అమూల్యమన్నారు. మన్మోహన్ సింగ్ గారి సారథ్యంలో మన దేశం అత్యధిక వృద్ధి రేటు సాధించి, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. కార్యక్రమంలో ఐ ఎన్ టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రి పాషా, జిల్లా అధ్యక్షులు బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్ సీ బజారన్న, మైనార్టీ నాయకుడు షేక్ ఖాజా హుస్సేన్, డీసీపీ మాజీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నాయకులు నాగన్న, జమ్మన్న, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

# ఖచ్చితమైన రాబడి కోసం బ్యాంక్ ఎఫ్‌డిలు.. ప్రైవేట్ బ్యాంకుల నుండి అదనపు వడ్డీని పొందండి!




మన గళం, చాలామంది పెట్టుబడిదారులు, పెట్టుబడి పథకాల విస్తృత శ్రేణి అందుబాటులో ఉన్నప్పటికీ, బ్యాంక్ డిపాజిట్‌లు అందించే భద్రత కారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను ఇష్టపడతారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే ప్రైవేట్ బ్యాంకులు 0.5% నుండి 1% వరకు అదనపు వడ్డీ రేట్లను అందిస్తున్నాయి, ఇది రిస్క్-విముఖత కలిగిన పెట్టుబడిదారులకు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లకు మరియు గ్రామీణ ప్రాంతాలలోని వారికి ఆకర్షణీయమైన ఎంపికగా నిలుస్తుంది. తప్పనిసరిగా స్థిరమైన మరియు హామీతో కూడిన రాబడిని కోరుకునే వారికి, బ్యాంక్ ఎఫ్‌డిలు ఆదర్శవంతమైన పెట్టుబడి మార్గాన్ని అందిస్తాయి. సీనియర్ సిటిజన్‌లు మరియు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, తరచుగా సురక్షితమైన పెట్టుబడులకు ప్రాధాన్యత ఇస్తారు, ఇప్పటికీ బ్యాంక్ ఎఫ్‌డిలను తమ ప్రాథమిక ఎంపికగా చూస్తారు. మార్కెట్ అస్థిరత నుండి మూలధనాన్ని రక్షించేటప్పుడు క్రమబద్ధమైన రాబడిని అందించే సామర్థ్యం ఈ ఆదరణకు కారణం. అయితే, ఎఫ్‌డిలో పెట్టుబడి పెట్టే ముందు, అందుబాటులో ఉన్న వివిధ ఎంపికల వడ్డీ రేట్లను సరిపోల్చడం చాలా ముఖ్యం. అనేక ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగ బ్యాంకులు 1, 3 మరియు 5 సంవత్సరాల కాలానికి వేర్వేరు వడ్డీ రేట్లను అందిస్తాయి. ఈ రేట్లను సరిపోల్చడం ద్వారా పెట్టుబడిదారులు తమ పెట్టుబడిపై అత్యధిక రాబడిని పొందడానికి సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవచ్చు. సారాంశంలో, బ్యాంక్ %ఖీణ%లు భద్రత మరియు స్థిరమైన రాబడిని కోరుకునే వారికి ఆచరణీయమైన మరియు నమ్మదగిన పెట్టుబడి సాధనంగా మిగిలి ఉన్నాయి. ప్రైవేట్ బ్యాంకుల ద్వారా అందించే మెరుగైన వడ్డీ రేట్లు, రిస్క్ లేకుండా తమ సంపదను పెంచుకోవాలనుకునే వారికి ఒక అదనపు ప్రయోజనాన్ని అందిస్తాయి. అందువల్ల, పెట్టుబడిదారులు తమ నిర్ణయాలను తీసుకోవడానికి ముందు అన్ని అవకాశాలను అంచనా వేయడం మరియు అత్యంత ప్రయోజనకరమైన ఎంపికను ఎంచుకోవడం చాలా అవసరం.

# భారత మార్కెట్లోకి స్కోడా ఆక్టేవియా రీఎంట్రీ.. ఈ ఏడాది కోసం 100 కార్ల దిగుమతి

మన గళం, ప్రముఖ కార్ల తయారీ సంస్థ స్కోడా ఆటో ఇండియా తన మొదటి తరం సెడాన్ మోడల్ ఆక్టేవియాను తిరిగి భారత మార్కెట్లోకి తీసుకురానుంది. ఇటీవల కంపెనీ విడుదల చేసిన తన కాంపాక్ట్ ఎస్‌యూవీ కైలాక్ కస్టమర్ల ఆదరణ పొందడంతో దేశీయ మార్కెట్లో మరింత దూకుడుగా పోటీ ఇచ్చేందుకు తన హై-ఎండ్ సెడాన్ ఆక్టేవియా ఆర్ఎస్‌ను తీసుకురానుంది. ఆక్టేవియా ఆర్ఎస్ ప్రీ-బుకింగ్‌లు అక్టోబర్ 6 నుంచి ప్రారంభమవుతాయి. నవంబర్ 6 నాటికి డెలివరీలు జరుగుతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది కోసం కంపెనీ పూర్తిగా తయారైన దాదాపు 100 కార్లను దిగుమతి చేసుకోనుంది. ఆ తర్వాత స్థానికంగా కారును అసెంబుల్ చేయడంపై దృష్టి సారిస్తుంది. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఈ కారు ధర 39,965 యూరోలు (మన కరెన్సీలో రూ. 47.7 లక్షలు) ఉంది. అయితే, ఈ కారును పూర్తిగా తయారైన యూనిట్‌ను దిగుమతి చేస్తున్న నేపథ్యంలో మన మార్కెట్లో ధర ఇంకా ఎక్కువగా ఉండొచ్చని భావిస్తున్నారు. స్కోడా తన సెడాన్ విభాగంలో ఆక్టేవియా కారును మొదటిసారిగా 2001లో లాంచ్ చేసింది. కార్బన్ ఉద్గారాల నిబంధనల కారణంగా 2023లో ఈ మోడల్‌ను కంపెనీ నిలిపేసింది. దేశంలో ప్రస్తుతం దాదాపు 1,00,000 ఆక్టేవియా కార్లు ఉన్నాయి. మళ్లీ ఇటీవల కంపెనీ నుంచి వచ్చిన కైలాక్ మోడల్ కారణంగా దేశీయ మార్కెట్లో స్కోడా బ్రాండ్‌కు ఆదరణ పెరిగింది. ముఖ్యంగా కైలాక్‌కు డిమాండ్ కారణంగా స్కోడా ఈ ఏడాది జనవరి-ఆగస్టు మధ్య దాదాపు 30,000 కైలాక్ కార్లను విక్రయించింది. మిగిలిన మోడళ్లలో 17,000 కుషాక్, స్లావియా కార్లు ఉన్నాయి. జనవరి-ఆగస్టు మధ్య కంపెనీ అమ్మకాలు దాదాపు 135 శాతం పెరిగాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

నిర్లక్ష్యపు నీడలలో
శాతవాహనుల రాజధాని

అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు , శాత వాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహా రాష్ట్ర లోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లా నే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూర్ మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాల లోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాఖలో ఎపిగ్రాఫిక్ అసిస్టెంట్ (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరి శర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడగలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన “మహా తలవర, మహా సేనాధిపతిపతిస” అను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో “రజోగోబదస, రజో సమగోపస” అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వ రాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చు చున్నదని పురావస్తు శాఖ మాజీ డైరక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శా స్త్రీ సోదాహరణంగా నిరూపించారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలోనే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస గతం చేశారు. వానిలో “రజో శాతవాహ , రజో సాతకంనిస” అని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజంగా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాత వాహనుడు ఆంధ్ర గోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యులుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వివరించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదావరి వర్ణన ఆధారంగా, లభ్యమైనట్లు శ్రీముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని స్పష్టం అవుతున్నది. కోటిలింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటిలింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయనిసున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్రమాలను చేపట్టడంలో ఆలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్తాపకులు కవిత, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, కుర్రా జితేంద్ర బాబు లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షించే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిరక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత గత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

– జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



మనగళం, ఆలూరు : ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలూరు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలు అందుతున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు ఏ విధంగా ట్రీట్మెంట్ అందిస్తున్నారంటూ ఆరా తీశారు. మెడిసిన్ సరైన సమయానికి ఇస్తున్నారా? వైద్యులు బాగానే స్పందిస్తున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని కలెక్టర్ పేషెంట్ లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని, సమయానికి విధులకు హాజరై నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ వైద్యులకు,ఇతర సిబ్బందిని ఆదేశించారు. ప్రసవ విభాగాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ ఏ విధమైన డెలివరీ అయ్యారు అని కలెక్టర్ పేషెంట్ ను అడిగి తెలుసుకున్నారు. పుట్టిన పిల్లలను బాగా చూసుకోవాలని, సరైన సమయానికి భోజనం అందించాలన్నారు. రానున్న రోజుల్లో బాగా చదువు చెప్పించాలని, వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడే విధంగా చేయాలని కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, డీసీహెచ్ ఎస్ జఫ్రుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ పన్నుల తగ్గింపు పై అవగాహన కల్పించాలి



మనగళం, ఆలూరు : గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగులు జీఎస్టీ పన్నుల తగ్గింపు పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆలూరు మండల కేంద్ర పరిధిలోని గ్రామ సచివాలయం - 2 ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సచివాలయాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సిబ్బందిని ఆరా తీశారు. తాగునీరు, శానిటేషన్, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ ప్రజలకు జీఎస్టీ పన్నుల తగ్గింపులపై పూర్తిగా అవగాహన కల్పించాలని సచివాయల సిబ్బందికి సూచించారు. ఈ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయని, వాటిని క

అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు. ఆడపిల్లలకు విద్య పైన అవగాహన కల్పించి, చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. బాలింతలు, గర్భిణులు పోషకాహారాన్ని తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఏఎన్ఎం లకు సూచించారు. తాగునీటి పరీక్షలు చేసి శుద్ధమైన నీటిని అందించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పోషకాహారాన్నిపదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ను ఆదేశించారు. ఎక్కువగా ఈ ప్రాంతాల్లో వలసలకు వెళుతూ, విద్యార్థులను కూడా తీసుకెళ్తున్నారని పత్రికల్లో చూస్తున్నామని, అలా తీసుకెళ్లకుండా పిల్లలను బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## మొక్కలు నాటిన బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్.... మురళి నాయుడు





మన గళండోన్ భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి జన్మదిన ము పురస్కరించుకొని సేవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలి అని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. అందులో భాగంగా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులు అయి డోన్ కు మొదటి సారి విచ్చేసిన మురళి నాయుడు కి ఘనంగా సన్మానం చేసిన బీజేపీ నాయకులు,ఈ సందర్భంగా డోన్ సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద మొక్కలు నాటిన వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళి నాయుడు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం దేశం లోని ప్రజలు అందరు వారి తల్లి పేరున ఒక మొక్క నాటాలి పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమం విశ్వకర్మ ఇంప్లిమెంటేషన్ మెంబెర్ ఆర్మీ రామయ్య, మోర్చా నాయకులు శివశంకర్, దబ్బల దేవేంద్రుడు, ఓబీసీ నాయకులు ఉమ్మాజి రావ్, ఉల్చాల లక్ష్మిన్ నాయుడు, హరినాయుడు, నియోజకవర్గం జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, భరణి చంద్ర, మరియు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డోన్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ఆకస్మికంగా తనిఖీ





మన గళండోన్ పట్టణంలో ఆర్టీసీ ఎండీ %డ% వైస్ చైర్మన్ ద్వారక తిరుమలరావు శుక్రవారం డోన్ ఆర్టీసీ డిపోలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ధర్మవరం, తాడిపత్రి, డోన్ డిపోలు కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంలో ప్రయాణించే మహిళలకు మరింత అనుకూలమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. డిపోలలో చైర్లు,శుభ్రమైన టాయిలెట్లు, త్రాగునీటి వసతి తప్పనిసరి అని పేర్కొన్నారు. అలాగే కొత్త బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడతామని అన్నారు

## టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



మన గళండోన్ శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ డోన్ పోలీస్ స్టేషన్ను అకస్మాత్తుగా తనిఖీ చేశారు.కార్యాలయ పర్యావరణం,అధికారుల సిబ్బందినీ,స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ పరిసరాల్లో శుభ్రత, ఆయుధాల భద్రత, పట్టణంలోని చుట్టుపక్కల ప్రాంతాలను ఆయన పరిశీలించారు.ప్రజలకు న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత,ప్రతి ఫిర్యాదును సమయానికి నమోదు చేసి, దర్యాప్తు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## నంద్యాలను ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






మనగళం, నంద్యాల: నంద్యాలను ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో సంపూర్ణ అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ%–%హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాకు చేరుకున్న సమగ్ర ఆరోగ్య ప్రచార రథాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారానే అన్ని రకాల ఆరోగ్య సమస్యలలో 50 శాతం మేర పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎయిడ్స్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను కూడా ప్రజలు తేలికగా ఎదుర్కొనగలిగే విధంగా వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. సమయానికి సరైన మందులు వాడితే వ్యాధులను పూర్తిగా నియంత్రణలో ఉంచవచ్చని, ముఖ్యంగా హెచ్ఐవీ/ ఎయిడ్స్ విషయంలో ప్రజల్లో సరైన అవగాహన చాలా అవసరమని కలెక్టర్ వివరించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ వ్యాధి అధికారి డాక్టర్ శారదా బాయి మాట్లాడుతూ హైరిస్క్ ప్రాంతాలు, రద్దీ ప్రదేశాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టితో 15 రోజులపాటు ఈ ప్రచార రథం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ, వైద్య అధికారులు డా. కాంతారావు నాయక్, డా. అవినాష్ రెడ్డి, డా. తేజస్విని, డా. నౌషీన్, ఏపీ సాక్స్ ప్రోగ్రామ్ గణాంక అధికారి దేవిశంకర్ గౌడ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నాగరాజు, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు సామాన్యులకు ఊరట

**– వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలి**

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 ద్వారా సామాన్య ప్రజలకు ఊరట లభించిందని, ఈ విషయం పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను సూచించారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో జీఎస్టీ 2.0 (సూపర్ జీఎస్టీ %–% సూపర్ సేవింగ్స్), కుసుమ్/సోలార్ సంస్థలకు భూకేటాయింపులు, వాతావరణ మార్పులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందుతారని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రముఖ కూడళ్లలో హోర్డింగులు, వాల్ పోస్టర్లు ఏర్పాటు చేయాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు తెలిసేలా కూడా హోర్డింగులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మండల, గ్రామ స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో జీఎస్టీ తగ్గింపు వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా తెలియజేయాలని, ప్రజా ప్రతినిధులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెప్టెంబరు 25 నుండి అక్టోబరు 19 వరకు జరిగే వివిధ అవగాహన కార్యక్రమాల ద్వారా జీఎస్టీ లబ్ధి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. స్థానిక వ్యాపారస్తులతో కలిసి జీఎస్టీ పరిధిలోకి వచ్చే వస్తువులపై స్టాల్స్ ఏర్పాటు చేసి మేళాలను నిర్వహించాలన్నారు. జీఎస్టీ 2.0కు సంబంధించి మొబైల్ యాప్ లో అధికారులు మాత్రమే కాకుండా ప్రజలు కూడా నమోదు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా వాతావరణ మార్పుల దృష్ట్యా తుఫానులు, భారీ వర్షాలు ఎదురయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఆర్ఓ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

**– భద్రతా ప్రమాణాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు – జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల టౌన్ : జిల్లా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అన్ని ఆర్ఓ వాటర్ ప్లాంట్లు క్రమం తప్పకుండా నాణ్యతా పరీక్షలు నిర్వహించి, బీఐఎస్ ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆర్ఓ ప్లాంట్ల భద్రతా ప్రమాణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాల కారణంగా ప్రజలు ఎలాంటి అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న 364 ఆర్ఓ ప్లాంట్లు, పట్టణ ప్రాంతాలలో ఉన్న 214 ఆర్ఓ ప్లాంట్లలో ముమ్మర తనిఖీలు నిర్వహించి నీటి నమూనాలు సేకరించి ల్యాబ్ లకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి తాగునీటిని పరీక్షించే 13 పారామీటర్లైనా క్లోరైడ్, ఫ్లోరైడ్, టర్బిడిటీ, ఐరన్, నైట్రేట్, రంగు, వాసన, టోటల్ హార్డ్నెస్, ఆల్కలినిటీ, ఈకొలై బ్యాక్టీరియా, పిహెచ్, హెచ్2ఎస్ వైల్, కెమికల్ తదితర పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఆర్ఓ వాటర్ ప్లాంట్లలో నిర్దేశించిన ప్రమాణాలకు తక్కువగా ఉన్నా లేదా ఎక్కువగా ఉన్న సదరు ఆర్ఓ ప్లాంటులను సీజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



ప్రజల ఆరోగ్యం విషయంలో ఎటువంటి రాజీ లేదని, తాగునీరు నాణ్యతలో నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

# పీఎం సూర్య ఘర్ లక్ష్యాన్ని అధిగమించాలి

**– బ్యాంకర్ల సహకారంతో లబ్ధిదారులకు ఋణాలు మంజూరు చేయించండి – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల: ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని సమగ్రంగా అమలు చేసి, నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేయడమే కాకుండా అధిగమించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ పథకం అమలు ప్రగతిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా లబ్ధిదారులకు సౌర విద్యుత్ ప్రయోజనాలు అందించేందుకు పూర్తి స్థాయి అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని విద్యుత్ శాఖ ఏఈలను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి అర్హుడిని పథకంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆర్థిక చేయూత అవసరమైన లబ్ధిదారులకు బ్యాంకర్ల సహకారంతో తక్షణమే ఋణాలు మంజూరు చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంలో బ్యాంకులు సకాలంలో స్పందించి ప్రజలు లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. జిల్లాలోని కోవెలకుంట్ల, సంజామల, బనగానపల్లె, జలదుర్గం, ప్యాపిలి మండలాల్లో నిర్ణీత లక్ష్యంతో పోలిస్తే తక్కువ పురోగతి సాధించారని, వెంటనే వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న వారం రోజుల్లోగా 2 వేల లక్ష్యం పూర్తి చేసేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని ఆమె సూచించారు. అలాగే, గ్రామాల్లో జరిగే గ్రామ



సభల సందర్భంలో స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసి, ప్రజలకు పీఎం సూర్య ఘర్ పథకం ప్రయోజనాలను వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ చేరేలా, ఈ పథకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక ఆదా సాధ్యమవుతుందని ప్రజల్లో విశ్వాసం కల్పించాలన్నారు.

## పరిశ్రమలు రాష్ట్రం విడిచి తరలిపోయేలా...గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది

**– పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి మంత్రి టి.జి భరత్**

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలు రాష్ట్రం విడిచి తరలిపోయేలా వ్యవహరించిందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి మంత్రి టి.జి భరత్ ఆందోళన వ్యక్తం చేశారు. 20 లక్షల ఉద్యోగాలంటే వైసీపీ నేతలు వాలంటీర్ ఉద్యోగాలే అనుకుంటారని చెప్పారు. శాసనమండలిలో సూపర్ సిక్స్ పథకాలపై జరిగిన షార్ట్ డిస్కషన్‌లో మంత్రి టి.జి భరత్ మాట్లాడారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతోనే తాము పనిచేస్తున్నామన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ద్వారా 16 వేల మంది ఉద్యోగాలు పొందారన్నారు. సచివాలయం సమీపంలో నిర్వహించిన వేడుకకు డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు హాజరై ఎంతో సంతోషం వ్యక్తం చేశారని ఆయన చెప్పారు. మాటిచ్చిన విధంగా తప్పకుండా 20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరుతామని మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. ఇప్పటికే పది లక్షల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన 13 లక్షల కోట్ల ఎంఓయూల్లో ఏవీ గ్రౌండ్ అవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇండస్ట్రీస్‌ను తరిమేశారని ఆయన వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. పేరుగాంచిన అమరరాజ కంపెనీకి ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు



## ఉపాధి హామీ లక్ష్యాలను సాధించాలి

**– ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి**

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఉపాధి హామీ మరియు ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన సూచనల ప్రకారం జిల్లా యావరేజ్ వేజ్ రేట్ తగ్గకుండా చూసుకోవాలని డ్వామా అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో పనులను సమయానికి పూర్తి చేసి, లక్ష్యాలను సాధించడమే కాకుండా అధిగమించేలా కృషి చేయాలని సూచించారు. లేబర్ బడ్జెట్ అమలు విషయంలో చాగలమర్రి, బేతంచర్ల, బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, కోవెలకుంట్ల మండలాల్లో తక్కువ పురోగతి ఉన్నందున, సంబంధిత అధికారులు తక్షణమే లోపాలను సరిదిద్దుకొని ప్రగతి సాధించాలని కలెక్టర్ సూచించారు. గడువేముల, గోస్పాడు మండలాల్లో మంచి పురోగతి సాధించారని, సంబంధిత సిబ్బందిని ఆమె అభినందించారు. యావరేజ్ వేజ్ రేట్ విషయంలో కొత్తపల్లి, ఆళ్లగడ్డ, బేతంచర్ల మండలాలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని.... జిల్లా సగటు వేతన రేటు రూ.250/– కంటే తగ్గకుండా ఉండేలా కృషి చేయాలని ఆదేశించారు. క్యాటిల్ షెడ్ల నిర్మాణంలో సిరివెళ్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలు తక్కువ పురోగతి సాధించాయని, వెంటనే పనులు వేగవంతం చేయాలని సూచించారు. వ్యక్తిగత సోక్ పిట్స్ విషయంలో ఉయ్యాలవాడ, కొత్తపల్లి, కోవెలకుంట్ల, బేతంచర్ల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు మండలాలు వెనుకబడ్డాయని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా ఎపిడిలను కలెక్టర్ ఆదేశించారు.

# ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

మనగళం, నంద్యాల: నంద్యాల డివిజన్ ఏ.డి.ఏ ఇంచార్జి జయప్రకాశ్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అబ్దుల్ సలామ్ ఆధ్వర్యంలో నంద్యాల డివిజన్‌లోని వీఏఏ, వీహెచ్ఏ, యంపిఈఓలకు ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ కార్యక్రమం డీపీఎంయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పంటల దిగుబడులు తగ్గడం, భూమి ఆరోగ్యం దెబ్బతినడం, ఆహార నాణ్యత లో తగ్గుదల, ప్రజల ఆరోగ్యం పై ప్రభావం, వాతావరణ మార్పులు వంటి సమస్యలకు పరిష్కారం ప్రకృతి వ్యవసాయం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో నిరూపిత ఆధునిక శాస్త్రీయ విధానాలను వీడియో ద్వారా వివరించారు.



## సల్మాన్ ఖాన్ అంత పోరాటం చేశాడా?

మన గళం, సినిమా : భారీ పారితోషకాలు పుచ్చుకునే సినీ స్టార్లకు ఏం సమస్యలుంటాయిలే.. వాళ్ల జీవితం అంతా పూల పాన్పు అనుకుంటాం. కానీ వాళ్లలో కూడా వ్యక్తిగతంగా, ఆరోగ్య పరంగా అనేక సమస్యలు ఎదుర్కొనే వాళ్లుంటారు. బాలీవుడ్ సూపర్ స్టార్లలో ఒకడైన సల్మాన్ ఖాన్ ఈ కోవలోకే వస్తాడు. ఆయన లవ్ లైఫ్ ఎప్పుడూ సజావుగా సాగలేదు. వేర్వేరు వ్యక్తులతో ప్రయత్నించినా.. ఏ బంధం ఎక్కువ కాలం నిలవలేదు. చివరగా రొమేనియా భామ లులియా వాంటూర్‌తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు వీరి బంధం గురించి ఏ న్యూస్ లేదు. 60 ఏళ్లు దగ్గర పడుతున్నప్పటికీ బ్రహ్మచారిగానే ఉండిపోయాడు సల్మాన్. ఎక్కువ కాలం నిలబడని బంధాలకు తోడు.. తనకున్న ఆరోగ్య సమస్యలు కూడా సల్మాన్ పెళ్లి చేసుకోకపోవడానికి కారణాలని అంటారు. కాజోల్, ట్వింకిల్ ఖన్నా హోస్ట్ చేస్తున్న టీవీ షోలో అతను తన సమస్యల గురించి చెప్పిన మాటలు అభిమానులను కదిలించేశాయి. సల్మాన్‌కు ఏడున్నరేళ్లుగా ట్రిగెనిమల్ న్యూరాల్జియా అనే వ్యాధితో పోరాడుతున్నాడట. అది నరాలకు సంబంధించిన సమస్య. దీని వల్ల ప్రతి నాలుగైదు నిమిషాలకు ముఖంలో నొప్పి మొదలవుతుందట. దీని కోసం రోజూ పెయిన్ కిల్లర్లు వాడాల్సి వస్తుందట. నొప్పి తగ్గించుకోవడానికి సల్మాన్ ఒక క్రిటికల్ సర్జరీ కూడా చేసుకున్నాడట. దాంతో నొప్పి పూర్తిగా తగ్గిందని సల్మాన్ తెలిపాడు. ట్రిగెనిమల్ న్యూరాల్జియా వల్ల ఆత్మహత్య ఆలోచనలు కూడా వస్తాయట. ఈ సమస్య వల్ల సుసైడ్ చేసుకునే కేసులు పెద్ద సంఖ్యలోనే ఉంటాయని సల్మాన్ వెల్లడించాడు. ఈ జబ్బుతో పోరాడుతూనే విరామం లేకుండా సినిమాల్లో నటిస్తూ సాగినట్లు సల్మాన్ తెలిపాడు. తనకున్న ఈ సమస్య గురించి ఇప్పుడు బహిర్గతం చేయడానికి కారణం.. ఆ జబ్బు గురించి జనాల్లో అవగాహన పెంచడమే అని.. ఒకప్పటితో పోలిస్తే చికిత్స ఎంతో మెరుగైందని.. పూర్తిగా నివారించడం సాధ్యమే అని సల్మాన్ అంటున్నాడు. మొత్తానికి ఒక తీవ్ర సమస్యతో సల్మాన్ ఏడున్నరేళ్లుగా పోరాడుతున్న సంగతి తెలిసి అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సెలబ్రెటీలను ఫ్యాన్స్‌గా మార్చిన ఓజీ



మన గళం, సినిమా : స్టార్ ఇమేజ్ సంపాదించిన హీరోలందరికీ బయటి పెద్ద సంఖ్యలో అభిమానులుంటారు. కొందరికి ఆ నంబర్ కోట్ల సంఖ్యలో ఉంటుంది. ఐతే దీంతో పాటుగా ఇండస్ట్రీలో కూడా పెద్ద సంఖ్యలో అభిమానులను సంపాదించుకుని.. సగటు అభిమానుల్లా వారినీ ఎగ్జైట్ చేసే స్టార్ పవర్ కొందరికే ఉంటుంది. అలాంటి అరుదైన కోవకే చెందుతాడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. మెగాస్టార్ చిరంజీవి తమ్ముడు అనే గుర్తింపుతో ఇండస్ట్రీలోకి వచ్చి.. కొన్నేళ్లకే తనకంటూ సొంత బాణీ ఏర్పరుచుకుని.. తొలిప్రేమ, తమ్ముడు, బద్రి, ఖుషి చిత్రాలతో 2000కు అటు ఇటు యువతను ఉర్రూతలూగించిన ఘనత పవన్ సొంతం. ఆ సమయంలో సామాన్య యువతగా ఉన్న అనేకమంది తర్వాత సినీ రంగంలోకి వచ్చారు. నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు అయ్యారు. వాళ్లందరూ పవన్ పేరు చెబితే చాలు ఊగిపోతారు. పవన్ అభిమానులకు నచ్చేలా సినిమాలు చేస్తే, ఆయన సినిమాలకు పాజిటివ్ టాక్ వస్తే.. ఈ సెలబ్రెటీస్ అందరూ సామాన్య అభిమానుల్లా మారిపోతారు. ఇప్పుడు 'ఓజీ' సినిమా వాళ్లందరినీ వారిలోని ఫ్యాన్ బాయ్స్‌ను బయటికి తీసుకొస్తోంది. నిన్న హైదరాబాద్‌లో అనేక ప్రిమియర్ షోలు సెలబ్రెటీలతో నిండిపోయాయి. ఏఎంబీ, ప్రసాద్ మల్టీప్లెక్స్, విమల్ థియేటర్లు సెలబ్రెటీలతో కళకళలాడాయి. దిల్ రాజు, నాగవంశీ, ఎస్కేఎన్ లాంటి వాళ్లు ఓజీ షర్టులతో థియేటర్లకు వచ్చారు. సందీప్ రెడ్డి వంగ, కొరటాల శివ లాంటి ప్రముఖులు బిగ్ స్క్రీన్లలో సినిమాలు చూశారు. ఇక సోషల్ మీడియాలో అయితే పవన్ అన్నయ్య చిరంజీవి తమ్ముడి సినిమా సక్సెస్‌తో పరమానందభరితుడై పోస్టు పెట్టారు. మెగా హీరోల్లో చాలామంది తాము సెలబ్రెటీలమని మరిచిపోయి.. నిన్నట్నుంచి సగటు పవన్ ఫ్యాన్స్‌లాగే వ్యవహరిస్తున్నారు. పవన్‌కు హిట్టు వస్తే ఇండస్ట్రీ మొత్తం సంతోషం కనిపిస్తోంది. యాంటీ ఫ్యాన్స్ కూడా ఈసారి సినిమాను పెద్దగా టార్గెట్ చేయట్లేదు. ఇలాంటి అభిమానం కొందరికే దక్కుతుందని చెప్పాలి.

## సోల్ ఆఫ్ జటాధర




మన గళం, సినిమా : నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించే ఈ పాన్-ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. అద్భుతమైన విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో తెరకెక్కుతున్న జటాధర నవంబర్ 7న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. మేకర్స్ తాజాగా ఫస్ట్ ట్రాక్ 'సోల్ ఆఫ్ జటాధార'ను విడుదల చేశారు. సాంప్రదాయ సంగీతం, ఆధ్యాత్మిక టచ్ కలిసిన ఈ స్వరాలు మనల్ని జటాధర ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. రాజీవ్ రాజ్ కంపోజ్ చేసి, స్వయంగా పాడిన ఈ ఆడియో గ్లింప్స్ అందరిని ఆకట్టుకుంది. జీ స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అర్ణు అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు.



## గోట్ ఫైట్ నేపథ్యంలో 'జాకీ'

మన గళం, సినిమా :భారతీయ సినిమాలో తొలిసారిగా మట్టి రేసింగ్ నేపథ్యంలో రూపొందిన 'మడ్డీ' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. అదే విజయోత్సాహంతో మరింత ఆసక్తికరమైన కథాంశంతో, ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచడానికి డా.ప్రగభల్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'జాకీ'. పీకే7 స్టూడియోస్ సమర్పణలో డైరెక్టర్ డా౹౹ ప్రగభల్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల అయింది. 'వినుత్నమైన కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో గోట్స్ ఫైట్ ఆసక్తికరంగా ఉంటాయి. ముఖ్యంగా మధుర్కైలో సాంప్రదాయంగా కొనసాగుతున్న ఈ గోట్ ఫైట్ చుట్టూ అల్లుకున్న కథతో దీన్ని తెరకెక్కించాం. కేవలం ఫైట్స్ మాత్రమే కాదు అద్భుతమైన భావోద్వేగాలతో ప్రేక్షకులను కట్టిపడేసేలా ఈ సినిమా ఉంటుంది. రియల్ లోకేషన్స్‌లో చిత్రీకరించడమే కాకుండా 2022 నుంచి అక్కడి సాంస్కృతి సాంప్రదాయాలను అర్థం చేసుకోవడానికి అదే ప్రాంతంలో ఉన్నాను. సహజ సిద్దంగా చిత్రీకరించేందుకు అక్కడి ప్రజలతో మమేకమై, ప్రతీదీ తెలుసుకొని జాగ్రత్తగా షూట్ చేశాం' అని దర్శకుడు ప్రగభల్ చెప్పారు. యువన్ కృష్ణ, రిధాన్ కృష్ణన్, అమ్ము అభిరామి, మధు సుధన్ రావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన-దర్శకత్వం : డాక్టర్ ప్రగభల్, నిర్మాత: ప్రేమ కృష్ణదాస్, సీ దేవదాస్, సినిమాటోగ్రఫీ: ఉదయకుమార్, సంగీతం: సక్తి బాలాజీ, ఆర్ట్ డైరెక్షన్: సి.ఉదయకుమార్, సౌండ్: రాజా కృష్ణన్, ఫైట్ మాస్టర్: జాకీ ప్రభు.




## రూ.100కోట్ల వసూళ్లు.. నేడు ఓటీటీలో స్ట్రీమింగ్

మన గళం, సినిమా : మాలీవుడ్ ఇండస్ట్రీ రికార్డ్ ను తన పేరుతో రాసుకున్న మోహన్ లాల్ ఇటీవల తుడరమ్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. ఆ సినిమా రిలీజ్ అయిన కొద్దీ రోజుల గ్యాప్ లోనే హృదయపూర్వం అనే మరో ఫ్యామిలీ ఓరియెంటెట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఓనమ్ కానుకగా హృదయ పూర్వం వరల్డ్ వైడ్ గ రిలీజ్ అయింది. ఎంపురాన్, తుడారమ్ తో డబుల్ హండ్రెడ్ క్రోర్ చిత్రాలను దింపిన లాలట్టన్.. హృదయపూర్వం హ్యాట్రిక్ హిట్ అందుకున్నాడు. ఓనం రోజు అనేక సినిమాలు రిలీజ్ అయిన కూడా హృదయపూర్వం సూపర్ హిట్ టాక్ తో రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. కాగా ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ కు వచ్చేసింది. ఓటీటీలో మలయాళ సినిమాలకు ఉండే క్రేజ్ వేరు. అందుకే వీకెండ్ వస్తుందంటే.. మాలీవుడ్ మూవీస్ కోసం ఈగర్లీ వెయిట్ చేస్తుంటారు. ఎవ్రీ ఫ్రైడేలాగా ఈ వీకెండ్ కూడా మలయాళ స్టార్ మోహన్ లాల్ నటించిన హృదయ పూర్వం డిజిటల్ స్ట్రీమింగ్ కు వచ్చింది.



## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన హీరో నాగార్జున?

మన గళం, సినిమా : టాలీవుడ్ సీనియర్ హీరోలలో ఒకరైన నాగార్జున ఇటీవల కాలంలో నిత్యం వార్తల్లోకి ఎక్కుతున్నారు. కొద్ది నెలల కిందట తెలంగాణ మంత్రి తమ కుటుంబంపై చేసిన ఆరోపణలపై కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులోనే పలుమార్లు వారు కోర్టుకు వెళ్లాల్సి వచ్చిన విషయం తెలిసిందే. అయితే తాజాగా మరోసారి హీరో నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కొంత మంది తన ఫొటో, పేరును వాడుకుంటున్నారని.. తన అనుమతి లేకుండా తన పేరు గాని, ఫొటోలు గాని వాడకుండా ఆదేశాలు ఇవ్వాలని నాగార్జున కోర్టులో పిటిషన్ వేశారు. సినీ నటుల అనుమతి లేకుండా వారి పేరును వాడుకోవద్దని గతంలో ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. నాగార్జున పేర్కొన్న ప్రకారం, అనధికారికంగా అతని పేరుతో అనేక వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రచారం అవుతున్నాయి. అలాగే, అతని లైక్నెస్‌తో ఏఐ ఆధారంగా వీడియోలు, కంటెంట్ రూపొందించడం, అనధికారిక వాణిజ్య ప్రకటనల్లో ఉపయోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. కోర్టు ఈ పిటిషన్‌పై విచారణ ప్రారంభించి, తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వాలా అన్న అంశాన్ని పరిశీలిస్తోంది. ఇటీవలి సందర్భాలలో బాలీవుడ్ నటులు ఐశ్వర్య రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లకు కూడా కోర్టు వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఉత్తర్వులు జారీ చేసిన విషయం గుర్తుచేసుకుంటూ, నాగార్జున పిటిషన్ కూడా వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణలో ముఖ్యమైన సందర్భంగా భావించబడుతోంది. ఈ క్రమంలో హీరో నాగార్జున పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు ఏ విధంగా స్పందిస్తుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.



## ఆద్యంతం థ్రిల్ చేసే సిరీస్

మన గళం, సినిమా :అప్లాజ్ ఎంటర్టైన్మెంట్ సంస్థతో కలిసి నెట్‌ఫ్లిక్స్ 'ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్' అనే ఓ సరికొత్త తమిళ థ్రిల్లర్‌ను ప్రేక్షకులు ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. రాజేష్ ఎం సెల్వ దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో శ్రద్ధ శ్రీనాథ్, సంతోష్ ప్రతాప్ కీలక పాత్రలలో నటిస్తున్నారు. మేకర్స్ గురువారం ట్రైలర్‌ని విడుదల చేశారు. సిరీస్ అక్టోబర్ 2న స్ట్రీమింగ్‌కి సిద్ధమవుతోంది. నిజానికి ఫన్ కోసం ఆటలు ఆడాలి. కానీ అదే ఆట ఆడుతుంటే నిజజీవితంలో కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటే ఎలా ఉంటుంది? ఇప్పుడు సరికొత్త తమిళ థ్రిల్లర్ సిరీస్ ట్రైలర్ చూస్తుంటే కూడా అలాంటి ఫీలింగే కలుగుతుంది. వర్చువల్ గేమ్ ఆడుతున్నప్పుడు నిజ జీవితంలో దానివల్ల సంఘటనలు చోటు చేసుకున్నట్టుగా ఈ థ్రిల్లర్ ట్రైలర్ కనిపిస్తోంది. అక్టోబర్ రెండో తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సిరీస్ ట్రైలర్ చూస్తుంటే ఎన్నో సీక్రెట్స్ మరెన్నో మాస్కులు ఆవిష్కృతం కాబోతున్నట్టు కనిపిస్తోంది. దర్శకుడు రాజేష్ ఎం. సెల్వా మాట్లాడుతూ, 'ఈ సిరీస్‌తో మేం సృష్టించే ప్రపంచాలు, మనం జీవించే జీవితాల మధ్య సున్నితమైన గీతను అన్వేషించాలనుకున్నాను. సిరీస్ ఫ్యామిలీ డ్రామా, కాంప్లికేటెడ్ రిలేషన్స్ తో కూడిన ఓ థ్రిల్లర్. హైపర్-కనెక్టెడ్ యుగంలో ఏదీ కేవలం వర్చువల్‌గా మిగలదు. తెరపై జరిగే విషయం వాస్తవంలోకి చొచ్చుకొస్తుంది, నియంత్రించలేని పరిణామాలతో. ప్రతి మాస్క్ వెనుక ఒక సత్యం దాగి ఉంటుంది. నెట్‌ఫ్లిక్స్‌తో నా మొదటి తమిళ ఒరిజినల్‌గా నా విజన్ జీవం పోసుకోవడం అత్యంత ఆనందకరమైన అనుభవం' అని అన్నారు. 'స్వతంత్ర మహిళగా, అదే సమయంలో గేమింగ్ డెవలపర్‌గా ఉన్న పాత్రలోకి అడుగుపెట్టడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. నా పాత్ర సృష్టించిన ప్రపంచమే ఆమెకు వ్యతిరేకంగా మారి, ఆమె తప్పించుకోలేని భయంకరమైన వాస్తవంగా మారిన థ్రిల్లర్ జోన్‌లోకి ప్రవేశించడం సవాలుగా అనిపించింది. రాజేష్‌తో కలిసి పనిచేయడం ఈ ప్రయాణాన్ని మరపురానిదిగా చేసింది. నెట్‌ఫ్లిక్స్‌తో ఈ కథకు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు అను సంధానం కావాలని ఆశిస్తున్నాం. ఇది తప్పకుండా మీకు ఆద్యంతం థ్రిల్ ఇస్తుంది' అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

## రాజకీయ వ్యాఖ్యలపై కెప్టెన్ సూర్యకుమార్‌కు ఐసీసీ వార్నింగ్



మన గళం, టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి నుంచి హెచ్చరిక ఎదురైంది. పాకిస్థాన్‌తో మ్యాచ్ అనంతరం చేసిన రాజకీయ వ్యాఖ్యల విషయంలో ఆయన గురువారం ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ముందు విచారణకు హాజరయ్యాడు. భవిష్యత్తులో అధికారిక ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో ఇలాంటి రాజకీయ పరమైన వ్యాఖ్యలు చేయవద్దని కమిటీ ఆయనకు స్పష్టంగా సూచించినట్లు సమాచారం.దుబాయ్‌లో ఆసియా కప్‌లో భాగంగా ఈ నెల 21న పాకిస్థాన్‌తో జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అనంతరం సూర్యకుమార్ మాట్లాడుతూ, ఈ గెలుపును పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు అంకితం ఇస్తున్నామని, అలాగే 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ప్రస్తావించాడు. క్రీడాస్ఫూర్తిని మించినవి కొన్ని ఉంటాయని సూర్య వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఐసీసీకి ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ జరిగింది. బీసీసీఐ అధికారులు హేమాంగ్ అమిన్, సుమీత్ మల్లాపూర్కర్ కూడా సూర్యకుమార్‌తో పాటు విచారణకు హాజరయ్యారు. విచారణలో భాగంగా ప్రెస్ కాన్ఫరెన్స్ వీడియో క్లిప్పులను చూపించగా, ఆ వ్యాఖ్యలు తాను చేసినవేనని సూర్య అంగీకరించినట్లు తెలిసింది."ప్రతి ఒక్కరూ రాజకీయాలు మాట్లాడటం ప్రారంభిస్తే, పరిస్థితిని అదుపు చేయడం కష్టమవుతుంది" అని ఐసీసీ కమిటీ సూర్యకుమార్‌కు వివరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మ్యాచ్ సందర్భంగా టాస్ సమయంలో, మ్యాచ్ ముగిశాక ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోకపోవడం కూడా ఉద్రిక్తతలకు అద్దం పట్టింది.ఇదిలా ఉండగా, భారత్ చేసిన ఫిర్యాదు మేరకు ఇద్దరు పాకిస్థాన్ ఆటగాళ్లు కూడా విచారణను ఎదుర్కోనున్నారు. సూపర్-4 మ్యాచ్ సందర్భంగా అనుచిత, రాజకీయ సైగలు చేశారని ఆరోపిస్తూ సాహిబ్జాదా ఫర్హాన్, హారీస్ రవూఫ్‌లపై బీసీసీఐ ఫిర్యాదు చేసింది. బ్యాట్‌తో తుపాకీ పేల్చినట్లు ఫర్హాన్, విమానం కూలినట్లు రవూఫ్ సంజ్ఞలు చేయడం వివాదాస్పదమైంది. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ ఉన్నందున వారు నిన్న విచారణకు హాజరుకాలేదని, ఈ రోజు కమిటీ ముందు హాజరవుతారని తెలిసింది.

## టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్



మన గళం, వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే టెస్టు సిరీస్‌కు భారత జట్టును ప్రకటించారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్‌పై వేటు వేసిన సెలెక్షన్ కమిటీ.. దేవదత్ పడిక్కల్‌కు చోటు కల్పించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ.. ఇండియా-ఎ తరఫున ఆస్ట్రేలియా-ఎపై రాణిస్తున్న పడిక్కల్ ఎంపిక సరైన నిర్ణయమేనని పేర్కొన్నాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో కరుణ్ నాయర్ నుంచి మేము చాలా ఆశించాం. కానీ, అతడు మా నమ్మకాన్ని వమ్ము చేశాడు. అందుకే.. వెస్టిండీస్ సిరీస్‌కు పడిక్కల్‌ను తీసుకున్నాం. ఆస్ట్రేలియా-ఎపై పడిక్కల్ సెంచరీతో చెలరేగాడు. సో.. నాయర్ కంటే ప్రస్తుతం అతడే మాకు మంచి ఛాయిస్ అనిపించాడు. ఇక జట్టులోని వాళ్లకు 15-20మ్యాచ్‌లు ఆడే అవకాశమిస్తాం. అప్పటికీ వాళ్లు రాణించకుంటే వేటు వేయడానికి ఆలోచించం' అని అగార్కర్ వెల్లడించాడు. ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను తీసుకోకపోవడంపై కూడా చీఫ్ సెలెక్టర్ స్పష్టత నిచ్చాడు. ఓపెనింగ్ కోటాలో యశస్వీ జైస్వాల్, కెఎల్ రాహుల్ జోడి రాణిస్తున్నందున మూడో ఓపెనర్ అవసరం లేదని అగార్కర్ తెలిపాడు. ఒకవేళ ఇద్దరిలో ఎవరైనా గాయపడితే అప్పుడు ఈశ్వరన్ గురించి ఆలోచిస్తామన్నాడు. ఇక షమీని ఎంపిక చేయడంపై స్పందిస్తూ.. అతడు గత మూడేళ్లలో పెద్దగా క్రికెట్ ఆడింది లేదని, అందుకే పక్కన పెట్టేశామన్నాడు. డబ్ల్యూటిసి 2025-26లో భారత జట్టు స్వదేశంలో తొలి సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో అక్టోబర్ 2న తొలి టెస్టు, అక్టోబర్ 10న రెండో టెస్టు ఆడనుంది.

## సరికొత్త రికార్డును సృష్టించిన అభిషేక్ శర్మ



మన గళం, టీమిండియా యువ సంచలనం, బ్యాటర్ అభిషేక్ శర్మ ఆసియా కప్ చరిత్రలో సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఒకే ఎడిషన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచి, శ్రీలంక దిగ్గజ క్రికెటర్ సనత్ జయసూర్య పేరిట ఉన్న 17 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు.నిన్న బంగ్లాదేశ్‌తో జరిగిన ఆసియా కప్ 2025 సూపర్ ఫోర్ మ్యాచ్‌లో అభిషేక్ ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అతడు బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 37 బంతుల్లోనే 6 ఫోర్లు, 5 భారీ సిక్సర్ల సహాయంతో 75 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలో కేవలం 25 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.ఈ ఇన్నింగ్స్‌లో బాదిన 5 సిక్సర్లతో ఈ టోర్నీలో అభిషేక్ మొత్తం సిక్సర్ల సంఖ్య 16కి చేరింది. దీంతో 2008లో సనత్ జయసూర్య నెలకొల్పిన 14 సిక్సర్ల రికార్డు కనుమరుగైంది. ఆసియా కప్ చరిత్రలో ఒకే ఎడిషన్‌లో 15కు పైగా సిక్సర్లు కొట్టిన ఏకైక క్రికెటర్‌గా అభిషేక్ శర్మ నిలవడం విశేషం.శతకం చేసేలా కనిపించిన అభిషేక్, షార్ట్ థర్డ్ మ్యాన్‌లో ఉన్న ఫీల్డర్ రిషాద్ హుస్సేన్ అద్భుతమైన ఫీల్డింగ్‌కు రనౌట్‌గా పెవిలియన్ చేరాడు.

## వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ఆడబోయే ఇండియా జట్టు ఇదే



మన గళం, వెస్టిండీస్‌తో అక్టోబర్ 2 నుంచి జరగనున్న టెస్ట్ సిరీస్ కు భారత జట్టును బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రకటించారు. ఆసియా కప్ టోర్నీ కోసం దుబాయ్ లో ఉన్న భారత టెస్టు జట్టుసారథి శుభ్‌మన్ గిల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో అగార్కర్ తాజాగా భేటీ అయ్యారు. టెస్టు జట్టు కూర్పుపై వారితో చర్చించాక జట్టును ప్రకటించారు. రెండు టెస్టుల ఈ సిరీస్ లో టీమిండియా శుభ్ మన్ గిల్ సారథ్యంలో విండీస్ తో తలపడనుంది.వైస్ కెప్టెన్ గా రవీంద్ర జడేజాను, రిషబ్ పంత్ స్థానంలో ఎన్.జగదీశన్ ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఇంగ్లాండ్ పర్యటనలో పెద్దగా రాణించని కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్ లను పక్కన పెట్టారు. కాగా, జస్‌ప్రీత్ బుమ్రా రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడని అగార్కర్ పేర్కొన్నారు. షమీ ఫిట్‌నెస్‌పై ఇంకా అప్‌డేట్ రాలేదన్నారు. కరుణ్ నాయర్ తమ అంచనాలను అందుకోలేకపోయాడని అగార్కర్ చెప్పారు. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదుత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ (బ్యాకప్ వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్, జగదీశన్ (వికెట్ కీపర్), సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్.

## బంగ్లా బౌలర్ల దెబ్బకు పాకిస్తాన్ ఢమాల్



మన గళం, ఆసియ కప్ క్రికెట్ టోర్నీలో నిర్ణయాత్మక మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బౌలర్లు సమి ష్టిగా చెలరేగగా.. పాకిస్తాన్ బ్యాటర్లు చేతులెత్తే శారు. శ్రీలంకకు చెక్ పెట్టిన బంగ్లాదేశ్ సూపర్-4 రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను వణికించింది. స్పిన్నర్ రిషద్ హెుసేన్(2/18), పేసర్ తస్కిన్ అహ్మద్(3/28)ల విజృంభణతో పాక్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. బంగ్లా బౌలర్లు, ఫీల్డర్లు కట్టడి చేయడంతో పవర్ ప్లేలో 27 పరుగులు మాత్రమే చేసింది. 49 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన జట్టును మొహమ్మద్ హారిస్(31), నవాజ్ (25) ఆదుకున్నారు. వీరిద్దరి కీలక ఇన్నింగ్స్‌తో కోలుకున్న పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. టాస్ ఓడిన పాకిస్థాన్ ఆరంభంలోనే కష్టాల్లో పడింది. తస్కిన్ తొలి ఓవర్లోనే ఓపెనర్ ఫర్హాన్(4)ను ఔట్ చేసి వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాత హసన్ వేసిన ఓవర్లో సయీం ఆయూబ్ డకౌట్‌గా ఔటయ్యాడు. దాంతో.. ఆ జట్టు పవర్ ప్లేలో 2 వికెట్ల నష్టానికి 27 పరుగులు చేసింది. కెప్టెన్ సల్మాన్ అఘా(19)తో కలిసి జట్టును ఆదుకోవాలనుకున్న ఫఖర్ జమాన్(13)ను రిషద్ హెుసేన్ ఔట్ చేసి పాకిస్థాన్‌ను మరింత కష్టాల్లోకి నెట్టాడు. 49కే సగం వికెట్లు కోల్పోయిన దశలో అఫ్రిది(19) రెండు సిక్సర్లతో జట్టు స్కోర్ వేగం అందుకుంది. అయితే.. తస్కిన్ ఓవర్లో మరో పెద్ద షాట్‌కు ఆడి టైమింగ్ కుదరక కీపర్ అలీ చేతికి దొరికాడు. దాంతో, ఆరో వికెట్ 38 రన్స్ భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం మొహమ్మద్ హ్యారిస్(31), నవాజ్(25)లు చకచకా డబుల్స్ తీస్తూ.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోర్ వంద దాటించారు. కానీ.. హసన్ రిటర్న్ క్యాచ్‌తో హ్యారిస్‌ను వెనక్కి పంపాడు. ఆ తర్వాత లోయర్ ఆర్డర్లో ఫర్హాన్(14) ఒక్కడే రాణించడంతో పాక్ 135కు పరిమితమైంది. బంగ్లాదేశ్ బౌలర్లు తస్కిన్ కు మూడు, మెహిదీ మసన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

## ప్రపంచకప్‌కి ముందు భారత్‌కు ఊహించని షాక్



మన గళం, ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మరికొన్ని రోజుల్లో ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నమెంట్ ఈసారి భారత్, శ్రీలంక వేదికగా జరుగుతోంది. అయితే ఈ టోర్నమెంట్‌కి ముందు భారత్, కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతోంది. ఇందులో భాగంగా ఇంగ్లండ్ మహిళ జట్టుతో జరిగిన వన్డే మ్యాచ్‌లో భారత్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ పేసర్ అరుంధతి రెడ్డి (%ూతీబఅస్త్రఝఱ =వసఎ%) గాయపడింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో హీథర్ నైట్ ఆడిన బంతిని క్యాచ్ పట్టే ప్రయత్నంలో అరుంధతి, తన ఎడమ కాలుపై తేడాగా ల్యాండ్ అయ్యింది. దీంతో చాలాసేపు నొప్పితో బాధపడింది. ఫిజియో వచ్చి పరీక్షించిన తర్వాత, ఆమెను వీల్‌ఛైర్‌పై మైదానం నుంచి తీసుకెళ్లారు. అయితే ప్రస్తుతం ఆమె గాయం తీవ్రత ఎలా ఉందనే విషయంలో స్పష్టత లేదు. స్కానింగ్ కోసం ఆమెను ఆస్పత్రికి తరలించారు. దీంతో అరుంధతి గాయం తీవ్రంగా ఉంటే.. ఆమె ప్రపంచకప్‌లో పాల్గొనడం అనుమానంగా మారింది. అదే జరిగితే బిసిసిఐ ఆమెకు ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి ఉంటుంది. 27 ఏళ్ల అరుంధతి భారత్‌లో కీలక బౌలర్‌గా వ్యవహరిస్తోంది. ఈ ఏడాది ఆమె ఆరు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీసింది. ఒకవేళ అరుంధతి గాయంతో ఆడలేకపోతే.. ప్రపంచకప్‌లో ఆమె లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఇక ప్రపంచకప్ సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభంకానుంది. ఈ టోర్నమెంట్ మొదటి మ్యాచ్‌లో భారత్, శ్రీలంకతో తలపడనుంది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310